క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరాలతో మేలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట ఉన్నత పాఠశాలలో ఆదివారం నందిని రమేశ్ గాంధీ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో సామాన్య వ్యాధులతో పాటు కీళ్ల సంబంధిత వ్యాధులకు అనుభవజ్ఞులైన డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇటువంటి వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సిద్ధిరాములుగౌడ్‌లు సూచించారు. శిబిరంలో డా.సతీష్‌చంద్ర, రూపెందర్, సుష్మ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని బేతని సంరక్షణ నిలయం నిర్వాహకుడు సజీవ్ వర్గీస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దొంతిలో సంరక్షణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ఆయన ప్రారంభించారు. ప్రజల కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రోగులకు వైద్యులు రబ్బాని, కీర్తన చికిత్సలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బేతని ఆశ్రమ నిర్వాహకులు విల్సన్, వీరాబాబు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఉత్సవాల్లో క్రాంతికిరణ్ తదితరులు

రేగోడ్(మెదక్): మండలంలోని ప్యారారం గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప జాతర ఉత్సవాలకు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. అనంతరం కార్యకర్తలతో ముచ్చటించి వారి బాగోగులు తెలుసుకున్నారు. మీకు అండగా ఉంటానని, రాబోయే రోజులన్నీ మనవేనని భరోసా కల్పించారు. పార్టీ పటిష్టత కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.


ట్యాంకర్‌తో నీటి సరఫరా



ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గుండ్లపల్లిలోని ఎస్సీ కాలనీని ప్రజలకు ఆదివారం ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా చేశారు. కొంత కాలంగా రక్షిత వాటర్ ట్యాంకు నుంచి నల్లాల ద్వారా ఎస్సీ కాలనీకి నీరు చేరకపోవడంతో ట్యాంకర్ ద్వారా రెండు రోజులకోసారి నీటిని సరఫరా చేసేవారు. ట్యాంకర్ ద్వారా నీరు సక్రమంగా రావడం లేదని కాలనీవాసులు శనివారం ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని ట్యాంకర్ ద్వారా నిత్యం తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టినట్లు ఎంపీఓ తిరుపతిరెడ్డి, కార్యదర్శి సంతోష్‌కుమార్ అన్నారు.

డంప్‌యార్డును ఎత్తి వేయాలి



నిరాహారదీక్షలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, జేఏసీ నాయకులు

నర్సాపూర్: ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును ఎత్తి వేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు ఆయన ఆదివారం సంఘీభావం తెలిపి ఆయన మాట్లాడారు. డంప్‌యార్డుతో నర్సాపూర్‌కు నష్టం వాటిల్లుతుందని అన్నారు. ప్రజలు వద్దంటున్నందున ప్రజల అభీష్టం మేరకు డంప్ యార్డును ఎత్తి వేయాలని చెప్పారు. దీక్షలలో జేఏసీ నాయకులు యాదగిరి, బుచ్చేష్, రాజేందర్, మహేందర్‌గౌడ్, సుబ్రహ్మణ్యం, దిగంబర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బూర్గుపల్లి పశువైద్యశాల




శిథిలావస్థకు చేరుకున్న పశువైద్యశాల భవనం

మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో ఉన్న పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పశువులకు వైద్యం చేయించుకునేందుకు సరైన వసతుల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అందులోకి వెళ్లి మందులు ఇతర వాటిని భద్రపర్చుకునేందుకు భయాందోళనకు గురి కావాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతమైన బూర్గుపల్లిలో పశువులు అధికంగా ఉండడంతో ఏదైనా మందులు అందుబాటులో ఉంచుకునేందుకు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఈ విషయంపై పలుమార్లు గత ప్రభుత్వ హయాంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా... పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణం మంజూరు చేయించాలని రైతులు కోరుతున్నారు.

–హవేళిఘణాపూర్(మెదక్)

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

మండల కేంద్రం హవేళిఘణాపూర్ శివారులో ఔరంగాబాద్ కట్టపై ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి కిందపడిపోయే ప్రమాదం ఉన్నా.. సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. హవేళిఘణాపూర్‌లో జెడ్పీ హైస్కూల్, డైట్, డీఎడ్, ఎంజేపీ విద్యా సంస్థలు ఉండడంతో మెదక్ నుంచి ఔరంగాబాద్ రోడ్డు మీదుగా హవేళిఘణాపూర్ వస్తుంటారు. కూలిపోయే స్థితిలో ఉన్న విషయాన్ని గమనించిన గ్రామస్తులు కొందరు ప్రత్యామ్నాయంగా వైరుతో చెట్టుకు కట్టి ఉంచారు. నిత్యం ఈ రోడ్డులో జనం తిరిగే ఈ ప్రాంతంలో స్తంభం కూలిపోయే ప్రమాదం ఉందని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరిచేసి ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

–హవేళిఘణాపూర్(మెదక్)

పని కావాలంటే పర్సంటేజీ ఇవ్వాల్సిందే!

- అవినీతికి నిలయంగా పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయం
- పట్టించుకోని అధికారులు



అల్లాదుర్గం పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయం

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలోని పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయం పర్సంటేజీలకు నిలయంగా మారింది. కార్యాలయంలో అటెండర్‌దే హవా నడుస్తోంది. ఎస్టిమేషన్ కాపీ ఇవ్వాలన్న, ఎస్టిమేషన్ వేయాలన్న, ఎంబీ బుక్కు ఇవ్వాలన్న అటెండర్ చేయి తడపాల్సిందే. ముగ్గురు అటెండర్లు ఉంటే ఒక్కరు చెప్పిందే జరుగుతోంది. అతనికి ఏఈలు సహితం జీహుజూర్ అనాల్సిందే. అటెండర్ అవినీతి అక్రమాలకు పాల్పడుతుంటే ఉన్నతాధికారులతో పాటు, కార్యాలయంలో ఉన్న డీఈఈ, ఏఈలు నోరు మెదపడం లేదు. బిల్లు రాకున్న ఎంబీ బుక్ కదలలాలంటే అటెండర్‌కు పర్సంటేజీ ముట్టాల్సిందే. ఇది అల్లాదుర్గం పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో జరుగుతున్న అటెండర్ దందా.

బిల్లు రాక ఇబ్బందులు

లక్షలు పెట్టుబడి పెట్టి పనులు చేస్తే ఏళ్ల తరబడి బిల్లు రాక ఇబ్బందులకు గురవుతుంటే, పర్సంటేజీ ఇస్తేనే ఫైలు కదులుతుంది. కార్యాలయంలో ముగ్గురు అటెండర్లు ఉన్నారు. ఒక అటెండర్ జిల్లా కార్యాలయం నుంచి మూడేళ్ల క్రితం ఇక్కడికి బదిలీపై వచ్చాడు. అతనికి కంప్యూటర్‌లో ప్రవీణ్యం ఉంది. ఇదే అతని పర్సంటేజీలు, మామూళ్లు తెచ్చిపెడుతుంది. కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండటంతో అటెండర్ ఎస్టిమేషన్ వేసి, వర్క్ ఆర్డర్ ఇస్తాడు. ఇతను కార్యాలయానికి వచ్చేది 12 గంటలు తర్వాతే. ఏఈ ఎంబీ బుక్ ఇవ్వలేదని అడిగితే ఇచ్చానని దురుసుగా మాట్లాడినట్లు ఏఈలే చెబుతున్నారు. డివిజన్ పరిధిలోని పనులు చేసిన కాంట్రాక్టర్లు ఇతని కోసం పడిగాపులు కాయాల్సిందే. ఇటీవల డీఈ పదవి విరమణ పొందడంతో కొత్త డీఈ బాధ్యతలు చేపట్టడంతో అటెండర్ అక్రమాలు బయటపడ్డాయి. జిల్లా అధికారులు విచారణ చేసిచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డీఈ వివరణ

ఈ విషయంపై అల్లాదుర్గం డీఈ శివ ప్రసాద్‌ను వివరణ కోరగా అటెండర్‌పై ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. తాను ఇటీవలే బదిలీపై వచ్చానని, అటెండర్ కదలికలపై దృష్టి పెడ్తామన్నారు. అటెండర్ అక్రమాలపై మెదక్ ఈఈకి సహితం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

24 గంటల్లోనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నార్సింగిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



సబ్‌స్టేషన్‌లో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్

చిన్నశంకరంపేట(మెదక్): తీవ్రమైన ఎండలకు తోడు ఓవర్‌లోడ్‌తో నార్సింగి సబ్‌స్టేషన్‌లో ఫెయిల్ అయినా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 24 గంటల్లోనే విద్యుత్ శాఖ అధికారులు నూతన 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు పూర్తిచేసి విద్యుత్ సరఫరా చేశారు. రెండు రోజుల పాటు విద్యుత్‌శాఖ అధికారులు శ్రమించి నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నార్సింగి విద్యుత్‌శాఖ ఏఈ స్వామి, ఏడీఈ సోమేశ్వర్, ఎంఆర్‌టీ ఏడీఈ సుధాకర్, ఏఈ రవిందర్, టీఆర్‌ఈ రవిందర్ రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో శ్రమించారు. మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరాఫరా అవడంతో రైలుతు ఊపిరి పీల్చుకున్నారు.

బాల్య స్నేహితుల ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): ఇబ్బందుల్లో ఉన్న చిన్ననాటి స్నేహితురాలికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామానికి చెందిన మాధవిని నాగులపల్లి గ్రామానికి చెందిన పరశురాంతో వివాహం జరగగా, నెల రోజుల క్రితం పరశురాం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గోమారం ఉన్నత పాఠశాల 2005–06 పూర్వ విద్యార్థులు రూ.43 వేలు పోగుచేసి ఆదివారం ఆపదలో ఉన్న స్నేహితురాలు మాధవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, నారాయణరెడ్డి, ఆంజనేయులు, రాజు, రేణుక, సరిత, పద్మ, నాగరాణి, కృష్ణవేణి, స్వప్న, రీతూ, తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి



సంఘం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటరామిరెడ్డి

కొల్చారం(నర్సాపూర్): గ్రామంలోని రైతుల సంక్షేమానికి తన వంతుగా కృషి చేస్తానని, మండలంలోని సంగాయిపేట గ్రామ మంజీరా వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘానికి నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన సంఘం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి సంఘం పరిధిలో 400కు పైగా రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. సంఘం ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నిలిచిపోయిన రోడ్డు పనులు

ఇబ్బందుల్లో రైతులు



కంకర వేసి వదిలేసిన బీటీ రోడ్డు పనులు

శివ్వంపేట(నర్సాపూర్): నూతనంగా వేస్తున్న బీటీరోడ్డు పనులు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ రోడ్లకు మహర్దశ కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మండలంలోని శివ్వంపేట నుంచి చెన్నాపూర్ సామ్యతండా వరకు, బైలార్ రైస్‌మిల్ నుంచి చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలోని తూప్రాన్–నర్సాపూర్ హైవే వరకు మూడు కిలోమీటర్ల లింకు బీటీరోడ్డు పూర్తి చేసేందుకు ఎస్‌డీఎఫ్ నుంచి రూ.కోటి 70 లక్షలు మంజూరైనవి. అందుకు సంబంధించి పనులు ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించారు. చేసిన పనుల వరకు బిల్లులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కంకర వేసి పనులు నిలిచిపోవడంతో పొలాలకు వెళ్లే రైతులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు నిధులు త్వరగా మంజూరు చేసి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ విషయం గురించి ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా.. చేసిన పనుల వరకు బిల్లు చేయడం జరిగిందని నిధుల కొరతతో పనుల్లో ఆలస్యం అవుతుందని త్వరగా బీటీ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



జాల కిసనమ్మ(ఫైల్)

పాపన్నపేట(మెదక్): చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకున్నట్లు పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండలంలోని పొడిచన్‌పల్లికి చెందిన జాల కిసనమ్మ (66) ఈ నెల 12న ఇంట్లోకి వెళ్తుండగా, మెట్లపై నీరు ఉండటంతో జారి కింద పడింది. తలకు బలమైన గాయం కావడంతో మెదక్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, తర్వాత హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కొడుకు ఏసులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

18న జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు

రామాయంపేట(మెదక్): జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు ఈనెల 18న తూప్రాన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి రవీంద్రశర్మ, సహాయ అధికారులు శ్రీనివాసశర్మ, మధుశ్రీ శర్మ తెలిపారు. వారు ఆదివారం మాట్లాడుతూ.. సంఘంలో సభ్యత్వం ఉన్నవారు మాత్రమే ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులని పేర్కొన్నారు. అదే రోజు ఫలితం ప్రకటిస్తామని, అనంతరం ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారోత్సవం చేయిస్తామని వారు వివరించారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు



కొడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఉదయం ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేష్, విఘ్నేశ్ నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించారు.



శివ్వంపేట(నర్సాపూర్): లక్ష్మీనర్సింహస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

కొనసాగుతున్న సికింద్లాపూర్ జాతర

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర కొనసాగుతోంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. లక్ష్మీనర్సింహస్వామికి అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలి



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి డబుల్‌రోడ్డు మంజూరు చేయాలని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గంగారం, అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్ గ్రామాలకు ప్రభుత్వం డబుల్ బీటీరోడ్డు మంజూరు చేయాలని సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను కలుపుతూ గతంలో వేసిన బీటీరోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. అధికారులు స్పందించి డబుల్ రోడ్డు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లేశం, శేఖర్ తదితరులున్నారు.

ప్రజలు తిరస్కరించినా బుద్ధి మారలేదు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం అసెంబ్లీలో స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు అయన దిష్టిబొమ్మను దహనం చేశాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజలు తిరస్కరించినా.. బీఆర్‌ఎస్ బుద్ధి మారలేదని అన్నారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్ గా ఉండడం బీఆర్‌ఎస్‌కు నచ్చడం లేదన్నారు.



పాపన్నపేటలో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



మనోహరాబాద్‌లో..



నిజాంపేటలో..



తూప్రాన్ డివిజన్ కేంద్రంలో..



రామాయంపేటలో..



వెల్దుర్తిలో ..



చిలప్‌చెడ్‌లో..